క్లుప్తంగా

శ్యామలాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీలోని శ్రీ శ్యామలాంబదేవి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం భక్తబృందం ఆధ్వర్యాన భజన జరిగింది. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు పర్యవేక్షించారు.

ఎల్లో మీడియా విషపు రాతలు రాస్తే సహించేది లేదు

వైఎస్సార్ సీపీ చేనేత విభాగం నేత గొట్టుముక్కల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంపై విషపూరిత రాతలు రాస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర నాయకులు గొట్టుముక్కల రామకృష్ణ హెచ్చరించారు. ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని ఖండిస్తూ కంట్రోల్ రూం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఎల్లో మీడియా పత్రిక ప్రతులను చించివేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్, ఆయన కుటుంబ సభ్యులపై చేస్తున్న అసత్య ప్రచారాలు ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలకు 175 వైఎస్సార్‌సీపీ గెలవడం ఖాయమన్నారు.

సిద్ధమవుతున్న పొంగలి షెడ్డు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు పొంగలి ప్రసాదం సిద్ధం చేసేందుకు అవసరమైన గ్యాస్ పొయ్యిలను దేవస్థానం అందుబాటులోకి తీసుకురానుంది. దేవస్థాన ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద నిరుపయోగంగా ఉన్న షెడ్డును వినియోగంలోకి తీసుకురావాలని దేవస్థానం నిర్ణయించింది. రెండేళ్ల కిందట ఇక్కడే భక్తులు అమ్మవారికి పొంగలి వండేందుకు పొయ్యిలను అందుబాటులో ఉంచింది. గతంలో ఈవోగా బాధ్యతలు నిర్వహించిన సురేష్‌బాబు పొంగలి షెడ్డును మహా మండపం దిగువకు తరలించి ఈ షెడ్డులో క్లోక్ రూమ్ నిర్వహించారు. ఆ షెడ్డును కాలక్రమంలో తొలగించడంతో ఆరు బయటే భక్తులు పొంగలి వండేవారు. ఇటీవల దేవస్థాన పాలక మండలి కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబుకు పలువురు భక్తులు పొంగలి షెడ్డు లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పొంగలి షెడ్డును తిరిగి ఏర్పాటు చేయాలని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులను కోరారు. షెడ్డును శుభ్రం చేసి 20 గ్యాస్ పొయ్యిలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన పనులు జరుగుతున్నాయి. ఒకటి రెండు రోజుల్లో షెడ్డును ప్రారంభించవచ్చని తెలుస్తోంది.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వెలంపల్లి సాయి అవనీష్ మెమోరియల్ నాకౌట్ టీ 10 క్రికెట్ టోర్నమెంట్‌లో ట్రికో సీసీ జట్టు విజేతగా నిలిచింది. పశ్చిమ నియోజకవర్గం 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ సహకారంతో పోలవరపు సత్తి పది రోజులుగా విద్యాధరపురం గుప్తా సెంటర్‌లోని షాదీఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్స్ మంగళవారంతో ముగిశాయి. ముఖ్యఅతిథులు వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి విజేత ట్రికో సీసీ జట్టుకు రూ.25వేలు, ట్రోఫీ, రన్నర్ సెత్తి సీసీ జట్టుకు రూ.15వేలు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, ఎండీ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు దుర్గారావు, ఆర్గనైజర్లు దుర్గారావు, రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

సందడిగా దొంగలదోపు ఉత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో మంగళవారం రాత్రి దొంగలదోపు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. పాతశివాలయం, శ్రీ వసంత మల్లికార్జునస్వామి దేవస్థానం (బుద్దవారి గుడి) ఆలయాల శివరాత్రి కల్యాణోత్సవాలు శ్రీ కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆయా ఆలయాల స్వామి వార్లను అన్నసత్రం కమిటీ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్ ఇంటి వద్ద దొంగల దోపు ఉత్సవాన్ని నిర్వహించారు. తొలుత పాత శివాలయం, బుద్దు వారి గుడి నుంచి ఆదిదంపతుల ఉత్సవ మూర్తులను గ్రామోత్సవంతో తీసుకొచ్చారు. అనంతరం సాహితీవేత్తలు డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్ నేతృత్వంలో దొంగల దోపు కార్యక్రమం సంప్రదాయబద్ధంగా సాగింది. అమ్మవారి పక్షాన పాలపర్తి శ్యామలానందప్రసాద్, స్వామి వారి పక్షాన ఇతర సాహితీవేత్తలు పరస్పరం సంవాదంతో రక్తి కట్టించారు. వివాహ సమయంలో పెండ్లికుమార్తె ఇంటి నుంచి కొన్ని విలువైన వస్తువులను పెండ్లికుమారుని తరఫువారు దొంగిలించారని ఆరోపణతో ఆరంభమైన ఈ సంవాదం వినోదాత్మకంగా సాగింది. ఏటా మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు అనంతరం ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని శ్రీ కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ అధ్యక్షులు బచ్చు వెంకటప్రసాద్ వివరించారు. కమిటీ సభ్యులు వల్లంకొండ ప్రసాద్, జగన్మోహనగుప్తా తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ వీడ్కోలు సభ జరిగింది. సభలో పాల్గొన్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్లు అవుతు శ్రీశైలజ, బెల్లం దుర్గ, గ్రంథాలయ పరిషత్ జిల్లా చైర్మన్ జమలపూర్ణమ్మ కలిశారు. సీఎంను ఆత్మీయంగా పలకరించి మొక్కలు బహూకరించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









శివారువాసులకు జలహారం

- సింగ్‌నగర్, వాంబేకాలనీ, న్యూఆర్ఆర్‌పేట శివారు ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు తొలగించడానికి ప్రభుత్వం చర్యలు
- ప్రతి ఇంటికి సురక్షిత నీటి కోసం రూ.80 కోట్లకు పైగా కేటాయింపు
- వాంబేకాలనీలో రూ.77 కోట్ల తో 5ఎంజీడీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్..
- రూ.4.16 కోట్లతో వైవీరావు ఎస్టేట్‌లో రిజర్వాయర్ నిర్మాణం
- ఏడాది లోపు పూర్తి చేయడానికి ప్రణాళికలు



వాంబేకాలనీలో 5ఎంజీడీ ప్లాంటును ఇక్కడే ఏర్పాటు చేయనున్నారు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఇంటి ముంగిట అభివృద్ధి వెలుగులే. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చకచకా చేస్తూ ప్రజల ఇబ్బందులు తొలగిస్తోంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం . దీనిలో భాగంగా నగర శివారు ప్రాంతాల్లో నీటి సమస్యలు తొలగించి అక్కడివారికి జలహారం బహూకరించడానికి వేగంగా చర్యలు తీసుకుంటోంది.

నీటి కష్టాల తొలగింపునకు రూ.80 కోట్లు కేటాయింపు

సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, ఆంధ్రప్రభకాలనీ, నందమూరినగర్, ఇందిరానాయక్‌నగర్, వైవీరావు ఎస్టేట్ పరిసర ప్రాంతాల్లోని నాలుగు డివిజన్లలో సుమారు లక్ష మంది జనాభా నివసిస్తున్నారు. శివారు కావడంతో ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పీడిస్తుంటుంది. గత పాలకులు నీటి సమస్య తీరుస్తామంటూ తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతాల్లో వాటర్ ప్లాంట్‌లు, రిజర్వాయర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. కేవలం తాగునీటి కోసమే రూ. 80 కోట్లకు పైగా నిధులను కేటాయించి ఈ ప్రాంతాల ప్రజల 'కన్నీటి' కష్టాలను తీర్చనుంది.

ఓ వైపు 5ఎంజీడీ వాటర్‌ప్లాంట్.. మరోవైపు రిజర్వాయర్..

శివారులో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాగునీటి సరఫరాకు అధిక నిధులు కేటాయిస్తున్నారు. పశ్చిమలోని వన్‌టౌన్ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద, 'తూర్పు'లోని గంగిరెద్దుల దిబ్బ 5ఎంజీడీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఉన్నాయి. ఇప్పుడు సెంట్రల్‌లోని వాంబేకాలనీలో నిర్మించనున్నారు. దీని కోసం అమృత్-2 నిధుల నుంచి రూ.77.02 కోట్లను కేటాయించారు. ఇది పూర్తయితే కృష్ణానది నుంచి నేరుగా నీరు 5ఎంజీడీ ప్లాంటుకు చేరుకొని ఇక్కడే శుద్ధి చేసి చుట్టుపక్కల మంచినీటి రిజర్వాయర్లకు వెళ్తాయి. అలాగే వైవీ రావు ఎస్టేట్‌లో రూ.4 కోట్ల వ్యయ అంచనాతో రిజర్వాయర్‌ను నిర్మించనున్నారు. ఏడాదిలో పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

శివారులో చివరి ఇంటికీ పుష్కలంగా తాగునీరు

చెంతనే కృష్ణానది ఉన్నా గత పాలకుల నిర్లక్ష్యంతో శివారు ప్రాంతాల్లో తరచూ తాగునీటి సమస్య ఎదురయ్యేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల తాగునీటి అవసరాలకు 80 కోట్ల రూపాయిలు పైగా నిధులు కేటాయించింది. మరో ఏడాదిలో 5ఎంజీడీ ప్లాంట్, వైవీరావు ఎస్టేట్‌లోని రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తదు. ప్రజా సమస్యలు విన్నవెంటనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి నిధులు కేటాయిస్తున్నారు.

– మల్లాది విష్ణు, సెంట్రల్ ఎమ్మెల్యే

ప్రపంచ పర్యాటక కేంద్రంగా అంబేడ్కర్ స్మృతివనం

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు సీహెచ్ ఆనంద ప్రకాష్, కాలే పుల్లారావు



స్మృతివనం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎస్సీ కమిషన్ సభ్యులు ఆనంద ప్రకాష్, కాలే పుల్లారావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ పర్యాటక కేంద్రంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దడం అభినందనీయమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు సీహెచ్ ఆనంద ప్రకాష్, కాలే పుల్లారావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ స్వరాజ్ మైదానంలో నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం పనులను మంగళవారం సాంఘిక సంక్షేమ అధికారులతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రూ.268 కోట్ల నిధులతో ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా దేశంలోనే అత్యంత భారీ విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఇప్పటికే పెడస్టల్ పనులు పూర్తయ్యాయని, కన్వెన్షన్ పనులకు సంబంధించి బేస్మెంట్, ఫ్లోరింగ్ పనులు పూర్తిచేశారన్నారు. ఏప్రిల్ 14వ తేదీ బీ ఆర్ అంబేడ్కర్ జయంతి రోజున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విగ్రహాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారని ఆయన తెలిపారు. విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు సీఎం వైఎస్ జగన్, మంత్రి మేరుగ నాగార్జునకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విజయభారతి, దళిత నాయకులు బూదల శ్రీను, నలకుర్తి రమేష్, కాలే వెంకటరమణరావు, లేళ్లపూడి లాజర్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్



ఎక్సెల్‌ప్లాంట్‌ను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా మంగళవారం ఆయన ప్లాంట్‌లో జరుగుతున్న పనుల పురోగతి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో కాల్-ఆన్ ఇండస్ట్రీస్ నిర్వహణలోని చెత్త వేయింగ్ (వే బ్రిడ్జి) పని తీరును పర్యవేక్షించి టోల్ గేటు మాదిరిగా ఈ ప్రాంతంలో కూడా భూమ్ బ్యారియర్ (ఆర్ఎఫ్ఐడీ రేడియో ఫ్రిక్వెన్సి) ఏర్పాటు చేయాలనీ సూచించారు. అనంతరం ఆయన రాజీవ్ నగర్‌లోని వీఎంసీ విభాగాధిపతుల సారథ్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమాన్ని సందర్శించి అందులో ఉన్న వసతి సదుపాయాలను పరిశీలించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సత్యనారాయణరావు, ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, ఎ.డి.హెచ్ శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక న్యాయం చేసిన సీఎం జగన్



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎమ్మెల్సీ ఎన్నికలలోనూ సామాజిక న్యాయం పాటించారని రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. మాచవరం దాసాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం నాయీబ్రాహ్మణ వాయిద్య వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యాన నాయీబ్రాహ్మణులను పాలకమండలిలో ధర్మకర్తలుగా నియమించేందుకు ఆర్డినెన్సు విడుదల చేసినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం జరిగింది. వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల యలమందరావు వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దాసాంజనేయస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండ, నాయీబ్రాహ్మణ వాయిద్య వృత్తి కళాకారుల సంఘం నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): గంజాయి విక్రేతలు ముగ్గురిని ఎస్ఎస్‌పురం పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్‌లోని శాంతినగర్‌కు చెందిన మాలపోలు శివనాగ మహేష్, షేక్ సులేమాన్, సత్యనారాయణపురం రామాలయవీధికి చెందిన రాగిరి వినోద్ స్నేహితులు. వారు వ్యసనాలకు బానిసగా మారి డబ్బు సులభంగా సంపాదించాలనే ఉద్దేశంతో విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తుంటారు. కొంత గంజాయి వారు వాడుకుంటు మిగిలిన దాన్ని విక్రయిస్తూ జల్సాలు చేసుకుంటున్నారు. మంగళవారం రాత్రి ఆ ముగ్గురు సత్యనారాయణపురం రామాలయం వీధిలో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఎస్‌పురం ఎస్సై వెంకటమహేష్ సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద క్యారీబ్యాగులు సోదా చేయగా చిన్నచిన్న ప్యాకెట్లుగా 2 కేజీల గంజాయి లభించింది. వారిని అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

మరో ఘటనలో

పాయకాపురం(విజయవాడరూరల్): సుందరయ్యనగర్ కట్ట వద్ద గంజాయి కల్గివున్న ముగ్గురు వ్యక్తులను నున్న రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీఐ కె.శ్రీనివాసరావుకు వచ్చిన సమాచారం మేరకు సుందరయ్యనగర్ కట్టవద్ద మున్నంగి సురేష్, పి.సాహెబ్, సయ్యద్ రసూల్‌ను తనిఖీ చేశారు. వారి వద్ద మూడు కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): వారం రోజులుగా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న తూర్పుపట్ల సత్యనారాయణమూర్తి(40) సోమవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 14న పైపులరోడ్డు వద్ద అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని బంధువులు ఉంటే నున్న రూరల్ పోలీసుస్టేషన్లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

కష్ట కాలంలో ఆదుకున్న సీఎం జగనన్న



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కరోనా కాలంలో ఆకలి కేకలు లేకుండా రాష్ట్రంలోని నిరుపేదలను ఆదుకున్న ఆపద్బాంధవుడు మన సీఎం జగనన్న, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆపద కాలంలో మా కుటుంబానికి ఎంతో దోహదపడ్డాయని 58వ డివిజన్ కృష్ణా హోటల్ సెంటర్ ప్రాంతానికి చెందిన ఫ్యాన్సీ షాపు నిర్వాహకురాలు శ్రీలక్ష్మి సంతోషం వ్యక్తంచేసింది. 'గడప గడపకు మన ప్రభుత్వం' మంగళవారం 58వ డివిజన్ 259వ వార్డు సచివాలయం పరిధిలో జరిగింది. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజలు 259 సచివాలయం పరిధిలోని శుభోదయ స్కూల్ రోడ్డు, కృష్ణాహోటల్‌సెంటర్, షాదీఖానా పరిసర ప్రాంతాల్లోని 212 గడపలను సందర్శించారు. షేక్ బాబు, షేక్ ఖాజావలి, రహీమున్నీసా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాకు పెన్షన్ ఇస్తుందని, చేదోడు పథకం కింద సహాయం అందించిందని, అమ్మ ఒడి తరపున ఆర్థిక సహాయం చేశారని తెలిపారు. పలువురు స్థానిక సమస్యలు తెలపగా స్థానిక అధికారులతో మాట్లాడి ఎమ్మెల్యే అక్కడికక్కడే పరిష్కరించారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో సామాజిక న్యాయం జరుగుతోందన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఈఈ శ్రీనివాస్, డీఈ రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరీ, వైఎస్సార్‌సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, తోపుల వరలక్ష్మి, అశోక్, క్రాంతి, బెజ్జం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సీఐ స్వరాజ్యలక్ష్మి



సీఐ స్వరాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో మంగళవారం మత్తుపదార్థాల వినియోగిస్తే కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ అందరూ గర్వించేలా ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు. ఎస్ఐ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ డ్రగ్స్ కారణంగా యువత వ్యక్తిగత జీవితంతోపాటు వారి కుటుంబం కూడా అష్టకష్టాలు పడుతుందని తెలిపారు. అనంతరం సీఐ రాజ్యలక్ష్మిని సత్కరించారు. ప్రిన్సిపాల్ నీరజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.15 లక్షలతో కండ్రికలో కర్మల భవనం



కండ్రికలో కర్మల భవనం నిర్మాణం

పాయకాపురం(విజయవాడరూరల్): విలేజి కండ్రికలో కర్మల భవన నిర్మాణం జరుగుతోంది. కండ్రికలో నాలుగువేల మంది జనాభా నివసిస్తున్నారు. 1989నుంచి విజయవాడ కార్పొరేషన్‌లో విలీనమైన తర్వాత విలేజి కండ్రికగా పిలుస్తున్నారు. గ్రామం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు సుమారు దాదాపు 75 సంవత్సరాలుగా విలేజి కండ్రికలో దహన సంస్కారాలకు సరైన సదుపాయం లేదు. తర్వాత నిర్వహించే పిండ ప్రదాన కార్యక్రమాలకు వసతి లేకపోవడంతో వర్షాలు వస్తే ఇబ్బంది పడేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి కర్మల భవనం సమస్యను తీసుకెళ్ళారు. ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి కర్మల భవనం నిర్మాణానికి వీఎంసీ నుంచి రూ.15 లక్షల నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయి. కర్మల భవనం త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానుందని ఏఈ సహాయకుడు నవీన్ తెలిపారు.

ఎస్ఆర్ఆర్ అధ్యాపకునికి మాతృభాషా సేవాశిరోమణి పురస్కారం



శేషుకుమార్‌కు పురస్కారం అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారభాషా సంఘం ఆధ్వర్యాన నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్‌ను మాతృభాషా సేవాశిరోమణి పురస్కారంతో సత్కరించారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది డాక్టర్ కేఆర్‌జీ శేషుకుమార్‌ను అభినందించారు.

యువతకు స్ఫూర్తి మహాకవి శ్రీశ్రీ



రెడ్ బుక్స్ డే సందర్భంగా మాట్లాడుతున్న ప్రసాదమూర్తి

విజయవాడ కల్చరల్: యువతలో కవితా స్ఫూర్తిని నింపిన మహాకవి శ్రీశ్రీ అని కవి ప్రసాదమూర్తి అన్నారు. రెడ్ బుక్స్‌డే సందర్భంగా ప్రజాశక్తి బుక్ హైస్ బాలోత్సవ భవన్‌లో మంగళవారం మహాప్రస్థానం కవితా పఠనం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తన కవిత్వం ద్వారా సమాజాన్ని కదిలించిన కవి శ్రీశ్రీ అన్నారు. ఆయన మహాప్రస్థాన కావ్యం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యాజీ శ్రీశ్రీ కవితా రీతులు అంశంగా ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్ హౌస్ నిర్వాహకులు లక్ష్మయ్య పాల్గొన్నారు. పలువురు కవులు మహాప్రస్థానంలోని కవితా ఖండికలను గానం చేశారు.

భవిష్యత్ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులదే

సమున్నతి టీం సభ్యులు



ముఖాముఖిలో మాట్లాడుతున్న సమున్నతి టీం సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవిష్యత్ అంతా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల దేనని సమున్నతి టీఎం సభ్యులు పేర్కొన్నారు. నగరంలోని ఏట అసోసియేషన్ హాలులో ప్రకృతి వ్యవసాయ ఎంటర్ ప్రెన్యూర్స్‌తో సమున్నతి టీఎం సభ్యులు ముఖాముఖి నిర్వహించారు. టీం సభ్యులు రాజ వల్లభనేని, ప్రవేశ శర్మ , సాయిప్రసాద్, సోమయాజులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే విధానాన్ని వివరించారు. ఇందులో భాగంగా ఎంటర్ ప్రెన్యూర్స్ అనుభవాలు తెలుసుకున్నారు. డీపీఓ విజయకుమారి, సీనియర్ తెమెటిక్ మార్కెటింగ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వస్త్రలత క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 23వ తేదీ అసోసియేషన్ హాల్‌లో రెండు వేర్వేరు హాస్పటల్స్ నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంజే నాయుడు హాస్పటల్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంత శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని వినియోగించుకోవాలని కోరారు.